సాక్షి
కామారెడ్డి

సోమవారం : 26 : ఆగస్టు : 2024



నేడు కృష్ణాష్టమి

శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని శ్రీకృష్ణాలయాలను ముస్తాబు చేశారు.

- 9లో ▸



'సంక్షేమం'పై చిన్నచూపు

సంక్షేమ వసతి గృహాల విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. 14 ఏళ్లుగా కాస్మాటిక్ చార్జీలు పెంచడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /21.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆలయ అభివృద్ధికి కృషి



కామారెడ్డి టౌన్ : అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయానికి సంబంధించిన అయ్యప్ప సేవా సమితి, అన్నప్రసాద సేవా సమితి నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పట్నం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గోనె శ్రీనివాస్, కోశాధికారిగా సోమిశెట్టి నారాయణ, అన్న ప్రసాద్ సేవా సమితి అధ్యక్షుడిగా విశ్వనాథుల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఓంకారం, అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా లక్ష్మీకాంతం తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా యాదగిరి, యాద నాగేశ్వరరావు, కైలాస్ శ్రీనివాసరావు, గౌరీ శంకర్, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 27న జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెడిదల రవిగౌడ్, మల్లేష్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు ఆర్గనైజింగ్ కార్యదర్శి భూపతికు వివరాలను అందించాలన్నారు. 2010 ఏప్రిల్ ఒకటి తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 95021 13860 కు సంప్రదించాలని సూచించారు.

సెలవుల్లో ఎస్ఈ రవీందర్


సుభాష్‌నగర్ : ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ వ్యక్తిగత సెలవుల్లో వెళ్లారు. అనారోగ్య కారణాలతో సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఆయన సెలవుల్లో ఉండనున్నారు. కామారెడ్డి ఎస్ఈ రమేశ్‌బాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సీఎండీ వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1083.30 అడుగుల నీరు నిల్వ ఉంది.

రుణం లేనిదే సాగని పయనం!

- ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల్లో డిపాజిట్లకన్నా లోన్లు అధికం
- ఎస్ఎల్‌బీసీ గణాంకాల ద్వారా వెల్లడి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జీవన గమనంలో ప్రతి కుటుంబం తమ అవసరాల కోసం అప్పులు చేయడం సహజం. తక్కువ వడ్డీ వసూలు చేసే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడానికే ప్రాధాన్యతనిస్తారు. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు పొందుతారు. నిరుద్యోగ యువత కూడా రుణాలు తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్నవారే ఎక్కువగా ఉంటారు.

వివిధ అవసరాలకోసం..

ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల్లో డిపాజిట్లకన్నా అప్పులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటి ఎస్ఎల్‌బీసీ(స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) గణాంకాలకు సంబంధించి క్రెడిట్ డిపాజిట్ (సీడీ) వివరాల ప్రకారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో డిపాజిట్లకన్నా రెట్టింపు సంఖ్యలో రుణాలున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో డిపాజిట్ల కన్నా అప్పులు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. అదే సెమీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లో కొంత తేడా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పంటల సాగు కోసం అప్పులు తీసుకోవడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు అప్పులు డిపాజిట్ల కన్నా ఎక్కువగా ఉంటున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలకు విరివిగా అందుతున్న రుణాలతో వారు ఆర్థికాభివృద్ధి సాధించే దిశలో ముందుకు నడుస్తున్నారు. బ్యాంకు రుణాల్లో వ్యవసాయం తర్వాత స్వయం సహాయక సంఘాలు తీసుకున్నవే ఎక్కువగా ఉంటున్నాయి. పట్టణాలు, నగరాల్లో వ్యాపార వర్గాలు, పారిశ్రామిక వేత్తలు ఎక్కువగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. గృహ రుణాలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగులు, ఇతర వర్గాల వారు సొంత ఇంటి నిర్మాణాలకు హౌజింగ్ లోన్లు తీసుకుంటున్నారు.

కామారెడ్డి జిల్లాలో...

జిల్లాలో అన్ని బ్యాంకులకు కలిపి 138 శాఖలు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1,261.04 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 2,831.08 కోట్ల అప్పులున్నాయి. సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ. 2,507.04 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 4,238.65 కోట్ల అప్పులున్నాయి. అర్బన్‌కు సంబంధించి రూ. 10.86 కోట్ల డిపాజిట్లు ఉంటే, రూ. 99.70 కోట్ల అప్పులు ఉన్నాయి. మొత్తంగా కామారెడ్డి జిల్లాలో రూ. 3,778.94 కోట్ల డిపాజిట్లు ఉండగా, రూ. 7,168.83 కోట్ల అప్పులు ఉన్నట్లు ఎస్ఎల్‌బీసీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో క్రెడిట్, డిపాజిట్ (సీడీ) రేషియో 189.70 శాతంగా నమోదయ్యింది.

ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల్లో డిపాజిట్లు, లోన్ల వివరాలు..

కామారెడ్డి జిల్లా	
బ్యాంకులు	: 138
డిపాజిట్లు	: 3,778.94 కోట్లు
అప్పులు	: 7,168.83 కోట్లు
క్రెడిట్, డిపాజిట్ రేషియో	: 189.70
నిజామాబాద్ జిల్లా	
బ్యాంకులు	: 283
డిపాజిట్లు	: 9,990.40 కోట్లు
అప్పులు	: 17,972.83 కోట్లు
క్రెడిట్, డిపాజిట్ రేషియో	: 179.90

నిజామాబాద్ జిల్లాలో...

జిల్లాలో 283 బ్యాంకు శాఖలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 2,887.69 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 6,303.87 కోట్ల అప్పులున్నాయి. సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ. 2,187.19 కోట్ల డిపాజిట్లు ఉండగా.. రూ. 4,127.00 కోట్ల అప్పులు, అర్బన్ ప్రాంతాల్లో రూ. 4,915.52 కోట్ల డిపాజిట్లు ఉంటే.. రూ. 7,541.96 కోట్ల అప్పులు ఉన్నాయి. మొత్తంగా రూ. 9,990.40 కోట్ల డిపాజిట్లు, రూ. 17,972.83 కోట్ల అప్పులున్నట్లు స్పష్టమవుతోంది. క్రెడిట్, డిపాజిట్ (సీడీ) రేషియో 179.90 శాతంగా ఉంది.

చేప విత్తనోత్పత్తిపై నిర్లక్ష్యం



అచ్చంపేట చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రం

- సిమెంట్ కుండీలకు పగుళ్లు
- పట్టించుకోని మత్స్యశాఖ

నిజాంసాగర్(జుక్కల్): చేపల మార్కెటింగ్, చేప పిల్లల పెంపకంలో ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రానికి తలమానికంగా నిలిచిన మండలంలోని అచ్చంపేట చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రం కళావిహీనమైంది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోని 5 నియోజకవర్గాల పరిధిలోని 44 గ్రామాలు 2,500 మత్స్య కార్మిక కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన అచ్చంపేట మత్స్య బీజ కేంద్రంపై పాలకుల చిన్నచూపు, మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నిజాంసాగర్ ఫిషర్ మెన్ కో ఆపరేటీవ్ మార్కెట్ సొసైటీని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో 36 సిమెంట్, 8 కచ్చా నర్సరీ(కుండీలు)లు మూలనపడ్డాయి. ప్రతి ఏడాది చేప పిల్లల విత్తనోత్పత్తి ప్రక్రియ చేపడుతున్నా ఈ ఏడాది మాత్రం కనిపించడం లేదు.

ప్రతిపాదనలకు పరిమితం

చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రం ఆధునికీకరణ కోసం గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేసిన ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.1.27 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. మత్స్యశాఖ, పంచాయతీ రాజ్, నీటి పారుదలశాఖ అధికారులు చేప పిల్లల విత్తనోత్పత్తికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించినా నిధుల జాడ కరువైంది.

ఫిషర్ మెన్ సొసైటీపై చిన్న చూపు

నిజాంసాగర్ ఫిషర్ మెన్స్ కో- ఆపరేటీవ్ మార్కెట్ సొసైటీ ఉన్నప్పటికీ మత్స్యశాఖ అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. జిల్లా మత్స్యశాఖ ఏడీ చైర్మన్‌గా ఉన్న సొసైటీలో 11 మంది మత్స్యకార్మికులు సభ్యులుగా ఉన్నారు. గత ఏడు సంవత్సరాల నుంచి సొసైటీ సభలు, సమావేశాలు, సభ్యుల తీర్మానాల జాడ కరువైంది. సొసైటీ చైర్మన్, మత్స్యశాఖ ఎఫ్‌డీవో, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తీర్మానాలను లెక్క చేయడం లేదని కార్మికులు వాపోతున్నారు. సొసైటీ పరిధిలో కొత్తగా మత్స్య కార్మికులకు లైసెన్సులు, చేపల వేటకు అనుమతులు ఇస్తున్నా సొసైటీ పాలకవర్గానికి ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. అంతే కాకుండా మత్స్యకార్మికుల నుంచి మాముళ్లు తీసుకుంటూ అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారని సొసైటీ సభ్యులు వాపోతున్నారు.

ఉపాధి కరువు



నిజాంసాగర్ ఫిషర్ మెన్స్ కో ఆపరేటీవ్ మార్కెట్ సొసైటీని అధికారులు పట్టించుకోకపోవడంతో మత్స్యకార్మికులు ఉపాధికి దూరమవుతున్నారు. ఏడు సంవత్సరాల నుంచి సొసైటీకి సంబంధించిన లెక్కలు లేవు. ఫైళ్లను సైతం అధికారులు మాయం చేసినట్లు తెలుస్తోంది. అధికారులు న్యాయం చేయాలి.

– బోయి రాములు, మాజీ డైరెక్టర్, అచ్చంపేట

నిధులు ఇవ్వాలి



అచ్చంపేట చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రానికి నిధులు మంజూరు చేసి, పూర్వవైభవం తీసుకురావాలి. నర్సరీల నిర్వహణ లేకపోవడంతో చేప పిల్లల విత్తనోత్పత్తికి నోచుకోవడం లేదు. మత్స్యశాఖ అధికారులు విధులకు సక్రమంగా హాజరు కాకుండా మత్స్యకార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారు.

– బాలకిష్టయ్య, మాజీ డైరెక్టర్, బాచపల్లి

జిల్లా స్థాయి యోగాసన పోటీలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో ఆదివారం జిల్లా స్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. 28 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథం, డీఈవో ఎస్.రాజు, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజయ్య, ప్రతినిధులు అనిల్‌రెడ్డి, రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



యోగా పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అధికారులు

ప్రథమ చికిత్సాలయం సీజ్

సదాశివనగర్: ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న పద్మాజీవాడి చౌరస్తాలోని ప్రథమ చికిత్సాలయాన్ని సీజ్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి చంద్రశేఖర్ ఆదివారం పద్మాజీవాడి చౌరస్తా, భూంపల్లి గ్రామాల్లోని మెడికల్ షాప్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భూంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు జ్వరంతో బాధపడుతూ పద్మాజీవాడి చౌరస్తాలో గల ప్రథమ చికిత్సాలయంలో వైద్యం చేయించుకున్నారన్నారు. వారికి హైడోస్ మందులు ఇచ్చినట్లు గుర్తించామన్నారు. ఇష్టానుసారంగా వైద్యం అందిస్తున్నారంటూ పీఎంపీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రథమ చికిత్సాలయాలకు వచ్చే వారికి ఇంజెక్షన్‌లు, గ్లూకోజ్‌లు పెట్టవద్దన్నారు.

అనుమతులు లేని మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మెడికల్ షాపుల యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ వైట్ల, ఏఎస్ఎంలు జ్యోతి, సంగీత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

కనిపించని కాలువలు

పోచారం ప్రధాన కాలువకు సంబంధించి డిస్ట్రిబ్యూటరీ - 11 కాలువ దుస్థితి ఇది. పూడికతోపాటు పిచ్చిమొక్కలు పెరగడంతో నాగిరెడ్డిపేట మండలంలో కాలువ ఇలా తయారైంది. దీంతో పోచారం ప్రాజెక్టు నీరు పంట పొలాలకు చేరడం లేదు. ఈ కాలువ కింద సుమారు 100ఎకరాలపైగా విస్తీర్ణంలో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. పోచారం ప్రాజెక్టు నీరు తమ భూముల్లోకి చేరేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ఆనవాళ్లు కోల్పోయిన పోచారం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువ

- అధ్వానంగా పోచారం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ, పంట కాలువలు
- సాగు భూములకు చేరని నీరు
- ఎండుతున్న పంటలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న నీరు పంటలకు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయకట్టు కింద సాగవుతున్న పంటల కోసం ప్రాజెక్టు నుంచి ఈనెల 15న నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు నీటిని విడుదల ప్రారంభించారు. అయితే, ప్రధానకాలువకు సంబంధించి కొన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలతోపాటు పంటకాలువలు అధ్వానంగా మారడంతో పంటలకు నీరందడం లేదు. నీరు వృథాగా ప్రవహిస్తూ మంజీరపాలవుతోంది.

ఆసక్తి చూపని రైతులు

డిస్ట్రిబ్యూటరీ, పంటకాలువల్లో పూడిక, పిచ్చిమొక్కలను తొలగించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా అంచనాలు రూపొందించినప్పటికీ కాలువల్లో పనిచేసేందుకు కూలీలు, రైతులు ఆసక్తి చూపడం లేదు. కొన్ని కాలువల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ.. బిల్లులు రావనే భయంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో కాలువలను అభివృద్ధి చేయలేక పోతున్నామంటున్నారు.

కనుమరుగవుతున్న కాలువలు

డిస్ట్రిబ్యూటరీ, పంట కాలువల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టపోవడంతో రూపురేఖలు కోల్పోతున్నాయి. పూడిక, పిచ్చి మొక్కలు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కాలువలు గుర్తు పట్టకుండా మారాయి. ఫలితంగా ప్రాజెక్టు నీటిపై ఆధారపడి సాగుచేస్తున్న పంటలు ఎండుతున్నాయి. పోచారం ప్రధాన కాలువకు సంబంధించి డి–1.5, 10ఏ, 11, 36, 42 తదితర కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది.

నీరందడం లేదు



డిస్ట్రిబ్యూటరీ కాలువ అధ్వానంగా మారడంతో పోచారం ప్రాజెక్టు నీరు భూములకు చేరడం లేదు. ప్రధానకాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు వృథాగా మంజీరాలోకి వెళ్తున్నది. పంటలసాగు అందాల్సిన నీరు వృథా కావడం బాధగా ఉంది. నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

– తలకొక్కుల రాములు, రైతు, చీనూర్

పంటలు కొట్టుకుపోయాయి



డిస్ట్రిబ్యూటరీ కాలువకు గండి పడడంతో ప్రధాన కాలువ నీరు నా పొలంలో ప్రవహించి పంట కొట్టుకు పోయింది. తర్వాత గండి పూడ్చినప్పటికీ కాలువను బాగు చేయకపోవడంతో సాగునీరు మా భూములకు చేరడంలేదు. డిస్ట్రిబ్యూటరీ కాలువపై ఆధారపడి వందెకరాలపైనే పంటలను సాగు చేస్తున్నారు.

– రోని సాయిలు, రైతు, చీనూర్

రైతులు ముందుకు రావడంలేదు

గతేడాది ఉపాధిహామీ పథకం ద్వారా డిస్ట్రిబ్యూటరీ, పంటకాలువలను అభివృద్ధి చేయించేందుకు అంచనాలు రూపొందించినప్పటికీ రైతులు ముందుకు రాలేదు. మరికొన్ని కాలువల్లో అభివృద్ధి పనులు చేయించేందుకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. అటు రైతులు, ఇటు కాంట్రాక్టర్లు రాకపోవడంతో కాలువలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

– వెంకటేశ్వర్లు, డీఈఈ, ఇరిగేషన్, ఎల్లారెడ్డి

వణికిస్తున్న డెంగీ

- నెల రోజుల్లో ఆరుగురి మృత్యువాత
- వందలాది మంది ఆస్పత్రులపాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్నాయి. విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చికున్ గున్యా, డెంగీ తదితర వ్యాధులతో వందలాది మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. డెంగీతో ఇప్పటికే ఆరుగురు మృత్యువాతపడడం ఆందోళన కలిగిస్తోంది.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో విషజ్వరాల తీవ్రత పెరిగింది. కొన్ని గ్రామాల్లోనైతే ఏ ఇంటికి వెళ్లినా జ్వరాలతో ఇబ్బంది పడుతున్న వారే కనిపిస్తున్నారు. మొదట సాధారణ జ్వరాలుగా భావించి స్థానికంగా చికిత్సలు పొందుతున్నారు. జ్వరాలు ఎంతకూ తగ్గకపోవడంతో ఆస్పత్రులకు వెళ్తున్నారు. వైద్యులు పరీక్షలు చేసి ప్లేట్‌లెట్స్ పడిపోయాయని చెప్పి ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. రక్తకణాలు తగ్గిపోయి చికిత్సలు పొందుతూనే పలువురు ప్రాణాలు కోల్పోయారు. నెల రోజుల్లో జిల్లాలో వందలాది మంది డెంగీ బారిన పడ్డారు. ఇందులో ఆరుగురు మృతిచెందారు. ఒక్క సదాశివనగర్ మండలంలోనే ముగ్గురు మరణించడం గమనార్హం. సదాశివనగర్ మండలంలోని భూంపల్లిలో ఇద్దరు, సదాశివనగర్‌లో ఒకరు మృతిచెందారు. తాడ్వాయి మండలం సంగోజీవాడిలో ఒకరు, లింగంపేట మండలంలో మరొకరు, బీర్కూర్ మండలం చించోలి గ్రామంలో ఇంకొకరు మరణించారు.

ఆస్పత్రులపాలు..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో డెంగీతో చాలా మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. సదాశివనగర్ మండలంలోని భూంపల్లి, సదాశివనగర్, లింగంపల్లి తదితర గ్రామాల్లో జ్వరాలతో చాలా మంది మంచం పట్టారు. మాచారెడ్డి మండలం లక్ష్మీరావులపల్లిలో ఊరంతా జ్వరాల బారిన పడగా 16 మందికి డెంగీ నిర్ధారణ అయ్యింది. లింగంపేట మండలంలో 22 మంది, పల్వంచ మండల కేంద్రంలో ఇద్దరు, భవానీపేటలో ఒకరు డెంగీ బారిన పడ్డారు. రామారెడ్డి, అన్నారం పీహెచ్‌సీల పరిధిలో ఇద్దరికి, రాజంపేటలో ఒకరికి, నిజాంసాగర్ మండలం ఒడ్డెపల్లిలో 11 మందికి, నాగిరెడ్డిపేటలో ఇద్దరికి డెంగీ నిర్ధారణ అయ్యింది. ఇంకా చాలా మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు.

డెంగీకి వైద్యం పేరుతో దోపిడీ

తీవ్రమైన జ్వరంతో వస్తున్నవారిని ప్రైవేట్ ఆస్పత్రులు దోచుకుంటున్నాయి. జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహిస్తున్న ఆయా ఆస్పత్రుల నిర్వాహకులు.. ప్లేట్‌లెట్స్ పడిపోయాయంటూ ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుంటున్నారు. కొందరిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యానికి రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఇబ్బందికరంగా మారింది. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై అధికారులు అధ్యయనం చేసి గట్టి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారు.



నేడు సీజనల్ వ్యాధులపై సాక్షి ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో వైరల్ ఫీవర్, డెంగీ, చికున్‌గున్యా, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆయా వ్యాధులతోపాటు ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోవడం తదితర సమస్యలకు సంబంధించిన అంశాలపై వైద్య సలహాలు, సూచనలు, అవగాహన కోసం 'సాక్షి' జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఆయా సమస్యలపై ప్రజలు కింది నంబర్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తేది : 26-08-2024 (సోమవారం)

సమయం: ఉదయం 10:00 నుంచి 11:00 గంటల వరకు.



రాంసింగ్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98480 91864

క్లుప్తంగా

రక్తనమూనాలు సేకరించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని భూంపల్లి గ్రామాన్ని ఆదివారం జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో విష జ్వరాలతో ఇద్దరు చిన్నారులు మరణించిన విషయం విదితమే. దీంతో గ్రామంలోని అన్ని వీధులను పరిశీలించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి రక్త నమూనాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వైద్యాధికారి ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డిగ్రీ కళాశాల పరిశీలన



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాలను ఎన్‌సీసీ యూనిట్ అధికారుల బృందం ఆదివారం పరిశీలించారు. ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకుగాను కళాశాల బృందం దరఖాస్తు చేసుకోవడంతో కళాశాల ఆవరణను 7వ బెటాలియన్‌కు సంబంధించిన ఎన్‌సీసీ అధికారుల బృందం సుబేదార్లు హరిప్రీత్‌సింగ్, రచ్‌పాల్‌సింగ్, బాబు పరిశీలించారు. కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు అధికారులు అనుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు కేపీ, సిద్ధురాజ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో బోర్ బావి తవ్వకం

భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని 4వ వార్డులో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి సహకారంతో బోర్‌బావిని తవ్వించినట్లు బీజేవైఎం జిల్లా కార్యదర్శి పైడి రాజశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఏలేటి గణేష్‌రెడ్డిలు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు బోరుబావి తవ్వించాలన్నారు.

ఆలయ అభివృద్ధి కోసం విరాళం

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డి వాసులు చాట్ల శ్రీనివాస్, మమత దంపతులు ఆదివారం రూ. 10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు దాతలకు స్వామి వారి చిత్ర పటాన్ని బహూకరించి సత్కరించారు.

మటన్ కర్రీలో బొద్దింక



హోటల్ యజమానికి అధికారులు జరిమానా విధించిన రసీదు

నిజామాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో భోజనం చేస్తున్న ఓ వ్యక్తికి ఆహారంలో బొద్దింక వచ్చింది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఉన్న సాయి మోక్ష హోటల్‌లో ఓ వ్యక్తి మటన్ కర్రీతో భోజనం చేసేందుకు వచ్చాడు. తీరా హోటల్ సిబ్బందికి తీసుకొచ్చిన భోజనంలో బొద్దింక వచ్చి షాక్‌కు గురయ్యాడు. ఇదేంటని ప్రశ్నించగా హోటల్ యజమాని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో బాధితుడు వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన కమిషనర్ హోటల్‌కు వచ్చి తనిఖీలు చేశారు. మటన్‌కర్రీలో బొద్దింక వచ్చినట్లు గుర్తించి హోటల్ యజమానికి నోటీసులు జారీ చేసి రూ.5 వేల జరిమానా విధించారు. కిచెన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు నాణ్యమైనవి ఉండాలని హెచ్చరించారు.

సంక్షేమంపై చిన్నచూపు

- 14 ఏళ్లుగా పెరగని కాస్మొటిక్ చార్జీలు
- బాలికలకు రూ.75.. బాలురకు రూ.50
- ఇక్కట్లకు గురవుతున్న వసతిగృహ విద్యార్థులు



బాన్సువాడలోని ఎస్సీ బాలుర వసతి గృహం

బాన్సువాడ : సంక్షేమ వసతి గృహాల విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. 14 ఏళ్లుగా కాస్మొటిక్ చార్జీలు పెంచడం లేదు. నెలకు బాలికలకు రూ.75, బాలురకు రూ.50 మాత్రమే చెల్లిస్తోంది. కాస్మొటిక్ చార్జీలను పెంచుతూ ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించగా, ఇప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో చేసిన ప్రతిపాదనలే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అరకొరగా అందిస్తున్న నగదుతో స్నానం, బట్టల సబ్బులు, టూత్ పేస్టు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇక కొబ్బరి నూనె, పౌడర్ డబ్బా, షాంపూ, ఆడపిల్లలకు శానిటరీ నాప్కిన్లు, బాలురకు ప్రతినెలా క్షవరం వంటి వాటి ఖర్చులకు డబ్బులు సరిపోవడం లేదు. నాప్కిన్లు కొనేందుకు డబ్బులు సరిపోకపోవడంతో బాలికలు ఆ మూడు రోజులు వివిధ కారణాలు చెప్పి తరగతులకు హాజరు కాలేకపోతున్నారు. వసతి గృహాలకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కాస్మొటిక్ చార్జీలకు బదులుగా కిట్లు అందిస్తామని అప్పటి విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి ఆధ్వర్యంలో మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయించింది. ఐదేళ్ల పాటు కేజీబీవీ, గురుకులాల్లో అమలు చేసి, సంక్షేమ వసతి గృహాలకు మొండిచేయి చూపింది.

జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు		
సంక్షేమశాఖ	హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ	29	3000
బీసీ	26	2600
ఎస్టీ	11	1430

లభించని ఆమోదం

ఉమ్మడి రాష్ట్రంలో 2008 మార్చిలో అమలు చేసిన కాస్మొటిక్ చార్జీలు ఇప్పటికీ అమలు చేస్తున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో 5 నుంచి 7తరగతుల బాలికలకు నెలకు రూ.125, బాలురకు రూ.150, 8 నుంచి 10వ తరగతుల బాలికలకు రూ.200, బాలురకు రూ.150 ఇవ్వాలని ఎస్సీ సంక్షేమ శాఖ ఐదేళ్ల క్రితం రెండు సార్లు ప్రతిపాదనలు పంపినా ఆమోదం లభించలేదు.

మెస్‌చార్జీల పెంపు లేదు

మెస్‌చార్జీలను పెంచాలని గత ప్రభుత్వ హయాంలో మంత్రుల బృందం 2023 మార్చి 1న నిర్ణయించినప్పటికీ ఆమోదం పొందలేదు. 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.1200, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1400 ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1875 చొప్పున ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించిన నివేదిక అటకెక్కడంతో పాత మెస్‌చార్జీలే అమలవుతున్నాయి. మరోవైపు హాస్టళ్లల్లో ఆహారం కలుషితమవుతోందని, నాణ్యమైన నిత్యావసరాలు వినియోగించడం లేదని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో హాస్టల్ వార్డెన్లు అప్పుచేసి విద్యార్థులకు భోజనం, కాస్మొటిక్స్ అందజేస్తున్నారు. ఐదారు నెలల తర్వాత బిల్లులు మంజూరైనా చేసిన అప్పులకు వడ్డీలు తమ జేబు నుంచి చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

చార్జీలు పెంచాలి



పేద విద్యార్థులే వసతిగృహాల్లో ఉండి చదువుకుంటారు. చాలాకాలంగా వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు పెంచకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరలకు పేద విద్యార్థులు కనీసం సబ్బులు కూడా కొనలేని పరిస్థితి ఉంది. అధికారులు, పాలకులు స్పందించి కాస్మొటిక్ చార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు, బాన్సువాడ

మొక్క చెప్పిన పాఠం





సృష్టిలో ఎండా కాలం.. వర్షాకాలం ఎలాగైతే ఒకదాని తర్వాత మరొకటి మారుతూ ఉంటాయో అలాగే జీవితంలోనూ కష్టాల వెంట సుఖాలు ఉంటాయి. కానీ కష్టాలు వచ్చినప్పుడు మాత్రం కొందరు భయపడుతుంటారు. వచ్చిన కొద్దిపాటి కష్టానికి జీవితం ఇంతే అంటూ ఆత్మహత్య చేసుకుంటూ తమ నిండు ప్రాణాలను బలి చేసుకుంటుంటారు. ఈ ప్రకృతిలో ఎండ తగలకుండా పెరిగిన చెట్టు లేదు.. కష్టం లేకుండా ఎదిగిన మనిషి లేడు. పడిన చోటే నిలిచి మన సత్తా ఏంటో చూయించాలంటోంది ఈ చిత్రంలో ఎదిగిన ఓ మొక్క. జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మినగర్ రోడ్ నంబర్-3లో ఓ కుటుంబం తిని కవర్‌లో పారేసిన మామిడి పీసు(టెంక) స్థానికంగా ఉన్న కేబుల్ వైర్లకు తట్టుకుంది. అందులో ఉన్న పీసు ఎండకు ఎండుతూ వానకు తడిచి ఇలా మొలకెత్తింది. పడిన చోటే ఇలా లేవాలని ఈ మొక్కను చూసిన వారందరూ చర్చించుకుంటున్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఘనంగా బీపీ మండల్ జయంతి



జిల్లా కేంద్రంలో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



బాన్సువాడలో బీపీ మండల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్ : బిహార్ మాజీ సీఎం, బీసీ రిజర్వేషన్ల పితామహుడు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివరాములు, ఉపాధ్యక్షుడు రాజయ్య, ప్రతినిధులు వెంకటి, అజీజ్, ఆకుల బాబు, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ జయంతిని జనగామలో ఆలిండియా అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు పాత రాము, మాజీ సర్పంచ్ రాజు, ఆకుల రాము, కుమార్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం బీపీ మండల్ జయంతిని నిర్వహించారు. బీసీ హాస్టల్‌లో బీపీ మండల్ చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డెన్ రాజేశ్వర్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు లింగమయ్య, బీఎస్పీ నాయకులు సాయిబాబా తదితరులున్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ : బీపీ మండల్ జయంతిని ఆదివారం బాన్సువాడలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు సాధించే కమిషన్ చైర్మన్‌గా బీపీ మండల్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు సాయికుమార్, రమేష్ తదితరులు ఉన్నారు.

నగరంలో పలుచోట్ల ఆకస్మిక తనిఖీ



నిరాశ్రయులతో మాట్లాడుతున్న కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నిజామాబాద్‌అర్బన్/ఖలీల్‌వాడి: నగరంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ కమిషనర్ మకరంద్ ఆకస్మికంగా పర్యటించారు. ఉదయం నాగారంలోని రాజారాం స్టేడియాన్ని సందర్శించారు. అక్కడ వాకర్స్‌తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజారాం స్టేడియం గ్రౌండ్‌ను పరిశీలించారు. అనంతరం రామర్తి చెరువు రెండో సర్కిల్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. పాత కలెక్టరేట్ పక్కన ఉన్న కుక్కల కుటుంబ నియంత్రణ విభాగాన్ని పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, సమయ పాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. చెత్తసేకరించే వాహనాలను పరిశీలించి వాటి వివరాలు తెలుసుకున్నారు.

నిరాశ్రయులకు ప్రత్యేక కేంద్రాలు

నగరంలోని నిరాశ్రయులకు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ మకరంద్ అన్నారు. శనివారం అర్ధరాత్రి రైల్వేస్టేషన్‌లోని నిరాశ్రయులతో కమిషనర్ మాట్లాడారు. నిరాశ్రయుల కేంద్రంపై అవగాహన కల్పించారు. అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించామని, ప్రతి ఒక్కరు అక్కడే ఉండాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణలు ఉన్నారు.

జంగంపల్లి వాసుల సన్యాసదీక్ష



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరూ ఆర్యసమాజ్‌మందిర్ ఆధ్వర్యంలో ఆదివారం సన్యాస దీక్ష తీసుకున్నారు. గ్రామానికి చెందిన పుల్లూరి మల్లయ్య సన్యాస దీక్ష తీసుకుని తన పేరును స్వామి సత్యానంద సరస్వతిగా పేరు మార్చుకున్నారు. బసప్ప సన్యాస దీక్ష తీసుకుని స్వామి ఓమ నంద సరస్వతిగా పేరు మార్చుకున్నారు. వీరికి సన్యాస దీక్షను హైదరాబాద్ ఆర్యసమాజ్ మందిరానకు చెందిన స్వామిజీ మురళి బ్రహ్మచారీ ధర్మనంద అందజేశారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు



బాన్సువాడ రూరల్ : గట్టుమీది గ్రామాలైన హన్మాజీపేట్, సంగోజీపేట్, కాద్లాపూర్, కోనాపూర్ గ్రామాలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీవర్గీకరణ తీర్పును హర్షిస్తూ సంబురాలు చేసుకున్నారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కాశీరాం, బోర్లం సాయిలు, రమేష్, గోవింద్ తదితరులున్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండల ఎస్సైగా అరుణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా కేంద్రం కామారెడ్డి వీఆర్ నుంచి బదిలీపై లింగంపేటకు వచ్చారు. లింగంపేటలో పనిచేసిన ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి చేగుంటకు వెళ్లారు.

బారెడు పోచమ్మకు బోనాలు



బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని మంగ్లూర్ గ్రామస్తులు ఆదివారం బారెడు పోచమ్మకు బోనాల ఉత్సవం నిర్వహించారు. శ్రావణమాసం మూడవ ఆదివారం పురస్కరించుకొని మంగ్లూర్ గ్రామ మహిళలు అమ్మవారికి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. పాడి పంటలు, పిల్లాపాపలను సల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఎస్టీ మోర్చా కమిటీ ఎన్నిక



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బీజేపీ నాగిరెడ్డిపేట ఎస్టీ మోర్చా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా రమావత్ దేవిసింగ్, ఉపాధ్యక్షులుగా సురేందర్, రమావత్ కబీర్‌దాస్, యాదగిరి, ప్రధాన కార్యదర్శులుగా భాస్కర్, ప్రకాష్, కార్యదర్శులుగా రవి, బాల్‌సింగ్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.



సమ్మేళనంలో పాల్గొన్న జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కామారెడ్డిటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హనుమాన్ మందిర్ స్కూల్‌లో 1990–91కు చెందిన మొదటి బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి మిత్రులందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: చేసిన అప్పు చెల్లించలేక మనస్తాపం చెందిన ఒకరు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన బూక్య ప్రశాంత్ (26) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి ఏడాది క్రితం వివాహమైంది. అవసరాల నిమిత్తం తన భార్యకు సంబంధించిన రెండు తులాల బంగారం గొలుసును ఓ బ్యాంక్‌లో తాకట్టుపెట్టి రూ.70 వేలు రుణం తీసుకున్నాడు. వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో తరచుగా బ్యాంక్ నుంచి ఫోన్‌లు వస్తున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు ఓ గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలాన్ని కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

ఎల్లారెడ్డి: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భిక్కనూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డెపల్లి రవి(35)కి కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని శ్మశాన వాటికలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డెంగీతో యువకుడి మృతి



నరేశ్ (ఫైల్)

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఓ యువకుడు డెంగీతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చిలుక నరేశ్(29) నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధ పడుతున్నాడు. కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించారు. పరిస్థితి విషమించగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రంలో డెంగీ కేసు నమోదు కావడం ఇది మొదటిది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

భిక్కనూరు: ఆరోగ్యం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యకు యత్నించిన ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన కైరంకొండ లింగం(29)కు ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. ఆయన ఆరోగ్యం బాగు కోసం అప్పులు అయ్యాయి. దీంతో అప్పులను ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురైన లింగం ఈ నెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు ఎల్లారెడ్డిపేటకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లక్ష్మీపూర్ క్యాంప్‌లో చోరీ

- జైలు నుంచి విడుదలై మరో చోరీకి పాల్పడిన నిందితులు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) జీపీ పరిధిలోని లక్ష్మీపూర్ క్యాంప్‌లో తాళం వేసిన ఇంట్లో ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ క్యాంపునకు చెందిన కమ్మ సత్యనారాయణ కుటుంబ సభ్యులు గత నెల రోజులుగా ఇంటికి తాళం వేసి వర్నిలో తన కుమార్తె వద్ద ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేనిది గమనించిన దుండగులు ఆదివారం తెల్లవారు జామున ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో విలువైన వస్తువుల కోసం గాలిస్తుండగా వచ్చిన శబ్దంతో పక్కింట్లో ఉండే జయబాబు బయటకు వచ్చి చూశాడు. దొంగలను గుర్తించిన ఆయన కేకలు వేయడంతో వారు పారిపోయారు. విషయాన్ని సత్యనారాయణకు చెప్పిన జయబాబు మరో ఇద్దరు శ్రీనివాస్, సురేష్‌తో కలిసి బైక్‌పై వెంబడించారు. పారిపోతున్న దొంగలను అక్బర్‌నగర్ శివారులో పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా చోరీకి పాల్పడింది తగిలేపల్లికి చెందిన ఇనాయక్ అలీ అలియాస్ షేక్ సలీం, అంబం(ఆర్)కు చెందిన దులిగ పోశెట్టిగా గుర్తించారు. వీరు ఇటీవల జైలు నుంచి విడుదలై మరో చోరీకి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..



ఖలీల్‌వాడి: నగరంలోని రోటరీనగర్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన కొమరయ్య కుటుంబీకులతో కలిసి శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లారు. రాత్రి 11 గంటలకు తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చోరీలో బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, రూ.25వేల నగదు, వెండిని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్బాబాదిలో బైక్..

ఖలీల్‌వాడి: నగరంలోని గుర్బాబాది రోడ్డులో ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కిరణ్ తన బైక్‌ను ఈనెల 15న రాత్రి తన ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

అడవి పందులను తరలిస్తున్న వాహనం పట్టివేత



స్వాధీనం చేసుకున్న వాహనంతో అధికారులు

నందిపేట్: మండలంలోని అయిలాపూర్ శివారు నుంచి అక్రమంగా అడవి పందులను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉన్నతాధికారుల సమాచారం మేరకు అయిలపూర్ శివారులో బొలేరో వాహన్నాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనంలో ఉన్న నాలుగు అడవి పందులు, వేటాడడానికి ఉపయోగించే జీఐ వైరు, వల, తాళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు పేర్కొన్నారు. పట్టుకున్న అడవి పందులను సమీప రిజర్వు ఫారెస్టులో వదిలి వేస్తామన్నారు. పరారైన నిందితులను త్వరలో పట్టుకుంటామని ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది ప్రసాద్, రవిరాజ్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

బోధన్‌టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని రాకాసీపేట్‌లో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి సీఐ వీరయ్య ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం .. మహారాష్ట్రకు చెందిన అర్మాన్ చండేశ్వర్ తన భార్య, ఏడాదిన్నర బిడ్డతో కలిసి ఉపాధి నిమిత్తం బోధన్‌లోని రాకాసీపేట్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం చండేశ్వర్ భార్య పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.